క్లుప్తంగా

23న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 23న ఉదయం 11:51 గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, కాకాని గోపయ్య స్వామిల 30వ వార్షిక కళ్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈనెల 24న ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు జలబిందెల కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెదకూరపాడులో 159, 160, 161, 162, 163, 164, 169 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. ఓటింగ్‌కు వచ్చే ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారి వెంట బీఎల్‌వోలు ఉన్నారు.

22 నుంచి జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసి యున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వారి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంతో ప్రారంభమై 26వ తేదీన ముగుస్తాయన్నారు. ముగింపు రోజున స్వామి వారి కళ్యాణోత్సవం, కుంభాభిషేకం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఈ కేవైసీతో పంట పొలాలకు బీమా

నకరికల్లు: ప్రభుత్వం రైతుల కోసం అందజేస్తున్న సంక్షేమ ఫలాల లబ్ధి పొందేందుకు సాగుచేస్తున్న పంటలకు ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. ఫార్మర్ ఈ కేవైసీ నమోదు చేసుకున్న పొలాలకు మాత్రమే బీమా, ప్రకృతి వైపరీత్యాలకు పరిహారం తదితర పథకాలు అందుతాయన్నారు. సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈ కేవైసీ నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు.

నేడు అమరేశ్వరాలయంలో దుకాణాలకు వేలం

అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వ్యాపారస్తులకు వేలం పాటలు ఈనెల 19వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వూమూరి గోపినాథ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో తొమ్మిది రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు, అలాగే ఆలయ నిర్వహణకు అవసరమైన వస్తువులు సప్లై చేయుటకు ఈ బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని అందులో ఆయా వ్యాపారాలకు నిర్దేశించిన ధరావత్తు సొమ్మును దేవాలయ అధికారులకు చెల్లించాలన్నారు. మిగిలిన వివరాలకు 9666856255 నెంబరుకు గాని, దేవస్థాన కార్యాలయంలో పని గంటలలో సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలీలకు వంద పనిదినాలు కల్పించాలి

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా వంద పనిదినాలు కల్పించాలని ఏపీవో కోటమ్మ తెలిపారు. ఆదివారం వివిధ గ్రామాల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో ఉన్న ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులో 50 నుంచి 99 రోజులు పని దినాలు కల్పించిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వారికి తప్పనిసరిగా వంద పనిదినాలు కల్పించే దిశగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

ఘనంగా బోనాల వేడుకలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసి యున్న గ్రామ దేవతలు పోలేరమ్మ, అద్దంకమ్మ, కనకమ్మ అమ్మవార్ల కొలుపుల వేడుకలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా ఐక్యంగా పార్టీలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో కుంకుమ బండ్లు ఊరేగింపును మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు.

ఖర్చు లేకుండా వైద్యం

- తీరిన పేదల కష్టాలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో మండలంలో ఇప్పటి వరకు 38,960 మందికి వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న సుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు
- మెరుగుపడిన ఆరోగ్యశ్రీ సేవలు



పెదకూరపాడులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం

పెదకూరపాడు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్య శ్రీ వంటి పథకాలు పేదలకు వరంలా మారాయి. గతంలో సామాన్యుడికి ఏ చిన్న జబ్బు చేసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగు పెట్టాల్సిన పరిస్థితి. కానీ ఇప్పుడా అవసం లేదు. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమల్లోకి వచ్చాక నెలకొక సారి వైద్య బృందం గ్రామాలకే వచ్చి రోగులకు పరీక్షలు చేసి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పెదకూరపాడు మండలంలోని 20 గ్రామాల్లో ఇప్పటి వరకూ 38,960 మందికి సేవలు అందించారు. ఇక సుగర్, బీపీ రోగులకు నెలవారీ వైద్య పరీక్షలు, మందులు కొనుగోలు భారం తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించే 104 వాహనంలోనే ప్రతి నెల వారికి పరీక్షలు చేసి, ఉచితంగా నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. సుగర్ వ్యాధిగ్రస్తులు 9,804 మంది, బీపీ రోగులు 10,844, గర్భిణులు 1,157, 415 మంది బాలింతలకు సేవలు అందుతున్నాయి. తమకు వ్యాధి సోకినా, చేతిలో సొమ్ములు లేకపోయినా, అందుబాటులో ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా ప్రజల్లో ఏర్పడింది.

గర్భిణులకు వైఎస్సార్ ఆసరా

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మెరుగుపరిచిన మరో పథకం వైఎస్సార్ ఆసరా. గతంలో ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న గర్భిణికి ప్రోత్సాహకంగా కేవలం రూ.1,300 ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం పురుడు పోసుకున్న మహిళకు రూ.4వేలు నగదు సాయం చేయడమే కాకుండా, తల్లీ బిడ్డలను ప్రభుత్వ వాహనంలోనే ఇంటికి చేరుస్తున్నారు.



అరుదైన వైద్యం చేసి వరిబీజం తొలగిస్తున్న వైద్యులు

ఇప్పటి వరకు ఈ పథకం మండలంలో 987 మంది మాతృమూర్తులకు సాయం చేసింది. అంతే కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి వెలుగు పథకం ద్వారా గ్రామాలకు వచ్చి చిన్నారులకు, వృద్ధులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా ఇస్తోంది. ఈ పథకం ద్వారా మండలంలో 15 వేల మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 1,600 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించింది.

ప్రాణాలు నిలుపుతున్న ఆరోగ్యశ్రీ ..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ పథకం ద్వారా కేవలం కొన్ని రకాల వ్యాధులకే నిధులు మంజూరు చేసేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగేళ్లలో పెదకూరపాడు మండలంలో 3 వేల మందికి పైగా ప్రాణాలు కాపాడింది.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు..

మండలంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యం దరిచేరుతోంది. మండలంలో మొత్తం 14 హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు పూర్తి కానున్నాయి. ఈ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త ఉంటారు. వీరు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు తదితరులకు వైద్య సేవలు అందిస్తారు.

సీహెచ్‌సీలో ఆరోగ్య శ్రీ సేవలు

పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల నుంచి ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇక్కడ ఓపీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఫిజీషియన్, జనరల్ సర్జన్, డెంటల్ సర్జన్, పిల్లల వైద్యనిపుణులు, మత్తు డాక్టర్, స్త్రీ వ్యాధి నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఇటీవల పెదకూరపాడు సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స చేసి 4 కేజీల వరిబీజం తొలగించారు. దీంతో వైద్యశాలకు ఓపీ పెరిగింది. రూ.8 కోట్లతో నూతన సీహెచ్‌సీ జూలై నెలకు పూర్తి కానుంది.

ఫ్యామిలీ డాక్టర్ వరం..



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం పల్లె ప్రజలకు వరం . ఎంతో మంది ధీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. క్యాన్సర్ రోగులు కూడా ఉన్నారు. ఇంటికి వెళ్లి వైద్యం చేస్తుంటే వారి కళ్లలో ఆనందం కనిపిస్తుంది. ఎక్కడ లేని ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం.

–డాక్టర్ వెలిగొండరెడ్డి, 75త్యాళ్ళూరు వైద్యాధికారి

ప్రతి నెల వైద్యసేవలు ఇంటికే వచ్చి చేస్తున్నారు..



ప్రతి నెలా వైద్యబృందం గ్రామాలకు వచ్చి రక్త, మూత్ర పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకి వెళ్లే అవసరం లేకుండా పోయింది. ఫ్యామిలీ డాక్టర్‌తో మా ఆయుర్దాయం పెరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యంపై ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. వారికి ధన్యవాదాలు.

–చందా మస్తాన్, పెదకూరపాడు

బాల్యమిత్రుడిని కలిసిన సినీ హాస్యనటుడు బ్రహ్మానందం



సత్తెనపల్లిలో బాల్యమిత్రుడు సాంబశివరావు, కుటుంబ సభ్యులతో సినీ హాస్యనటుడు బ్రహ్మానందం

సత్తెనపల్లి: ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని బాల్య మిత్రుడు ఇంటిని ఆదివారం సందర్శించారు. పట్టణంలో స్టాంప్ వెండర్‌గా పనిచేస్తున్న నందా సాంబశివరావు అనారోగ్యంగా ఉండటంతో ఎప్పటి నుంచో ఆయనను కలవాలని బ్రహ్మానందం భావిస్తున్నప్పటికీ సాధ్యపడటం లేదు. ఈ క్రమంలో ఆదివారం గుంటూరులోని ఓ కళాశాలలో జరిగే ప్రోగ్రాంలో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యలో సత్తెనపల్లిలో తన బాల్యమిత్రుడు నందా సాంబశివరావును కలుస్తానని బాల్యమిత్రులైన సీనియర్ జర్నలిస్ట్ మారూరి పుల్లారెడ్డి, ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావులకు సమాచారం అందించారు. వారిరువురు కూడా నందా సాంబశివరావు ఇంటి వద్ద వేచి ఉండగా బ్రహ్మానందం అక్కడకు చేరుకొని నందా సాంబశివరావు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాంబశివరావు కుటుంబ సభ్యులతో ఫొటో దిగారు. ముందుగా వడ్డవల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజారిగా పని చేస్తున్న తన సోదరుడు శ్రీనివాసరావును కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా సినీ హాస్యనటుడు బ్రహ్మానందం సత్తెనపల్లి వచ్చాడని తెలియడంతో చూసేందుకు అభిమానులు ఆసక్తి కనబరిచారు. ఆయన వెంటనే గుంటూరు బయలుదేరి వెళ్లారు.

ఒత్తిడిని అధిగమించేందుకు మోటివేషన్ క్లాసులు



ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న రాధిక

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు మునగాల రాధిక ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రెన్ ది ట్రైనర్ కోర్సు పూర్తి చేశారు. ఈ మేరకు ఇంపాక్ట్ ఫౌండేషన్ చైర్మన్ గంపా నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి చేతుల మీదుగా సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకున్నట్లు రాధిక ఆదివారం తెలిపారు. కోర్సులో భాగంగా 24రోజులు ఆన్‌లైన్ క్లాసులు, రెండు రోజులు ఆఫ్‌లైన్ తరగతులకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు స్టడీ స్కిల్స్, సమయపాలన, తల్లిదండ్రులు, గురువుల పట్ల ప్రవర్తన, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వారిలో మానసిన స్థైర్యాన్ని నింపేందుకు తన శిక్షణ ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైన మనో నిబ్బరాన్ని పొందేందుకు ఈ క్లాసులు ఉపయోగపడతాయని తెలిపారు. పరీక్షలు సమీపిస్తుండటంతో పాఠశాలల వారీగా మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యార్థుల్లో దాగిన సృజనను వెలికితీయాలి



యడ్లపాడు: విద్యార్థులను విభిన్న రంగాల్లో తీర్చిదిద్దుతూ పాఠశాలతో పాటు గ్రామానికి ఖ్యాతి తెస్తున్న ఉపాధ్యాయులకు కొండవీడు గ్రామస్తులంతా రుణపడి ఉంటారని గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ మొహమ్మద్ యూనీస్ అన్నారు. మండలంలోని కొండవీడు గ్రామంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో భారతీయ కళలు, సృజనాత్మకత విభాగాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ముంబయికి చెందిన స్వచ్ఛంద సంస్థ రంగోత్సవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు హాజరై 9 విభాగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు విద్యార్థులను సంసిద్ధుల్ని చేసిన పాఠశాల హెచ్ఎం గోరంట్ల శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

గుండాటను నిషేధించాలంటూ ఫిర్యాదు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవ తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, గుండాట (బులాంగుల ఆట)ను నిషేధించాలంటూ గ్రామ సర్పంచ్ బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రతి ఏటా తిరునాళ్ల సందర్భంగా కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ జూదం, లాటరీ బోర్డులు, పేకాటలు నిర్వహిస్తుండంతో గ్రామంలోని ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సమస్యలను దృష్టిలో ఉంచుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు.

ప్రతి ఒక్కరూ ఏసు బాటలో నడవాలి



విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్య బలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. దీనికి ముందు పలువురు భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

వీరమాచినేటి సేవలు మరువలేనివి

మాచర్ల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశేష సేవలందించిన స్వర్గీయ వీరమాచినేటి సుభాష్‌చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని రొటేరియన్ డాక్టర్ రామకోటయ్య, తుమ్మల సత్యప్రసాద్, పఠాన్ నాగూర్‌వలి నివాళులర్పించారు. వీరమాచినేటి ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని 50 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అదే విధంగా పట్టణంలోని వివేకానంద అనాథాశ్రమానికి ఇన్వెర్టర్, బ్యాటరీలను అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది చంద్రబోస్ పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ క్లబ్ ఫౌండేషన్‌కు రూ.3 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.శంకరరావు, ఎల్.వెంకటేశ్వర్లు, ఇక్కుర్తి శంకర్, డాక్టర్ శ్రీకాంత్, చెరుకూరి నరసింహారావు, కర్నాటి వాసు, షేక్ మస్తాన్‌వలి, మేడమ్ నాగేశ్వరరావు, అన్నపరెడ్డి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఉయ్యాల రామకోటయ్య పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలతో పాటు రూ.1 లక్ష విలువైన నగదు బుగ్గిపాలైంది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు శకటంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీకి చెందిన ఎస్సీ కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో టీడీపీకి చెందిన 18 ఎస్సీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శనివారం రాత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీలన్నింటినీ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా నెరవేర్చాం కనుకే ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారన్నారు. కరుడు కట్టిన టీడీపీ వారు సైతం స్వచ్ఛందంగా వచ్చి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. మేము పక్కా టీడీపీ వారమని తెలిసినా మా అందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలు వచ్చాయని, ఎవరి ప్రమేయం లేకుండా తమ బ్యాంకు ఖాతాలో జమయ్యాయని, టీడీపీలో ఏవిధమైన న్యాయం జరగలేదని, పింఛను రావాలన్నా లంచాలు ఇచ్చుకోవలసి వచ్చేదని, అందువల్లనే రూపాయి ఖర్చులేకుండా అర్హతను బట్టి సంక్షేమ పథకాలు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు అండగా ఉండాలనుకుంటున్నామని పలువురు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చింతపల్లి రవీంద్ర, రవీంద్రబాబు, చిన్నయ్య, వడ్డవల్లి బాలస్వామి, కొమ్మవరపు లూర్థయ్య, మన్నెపల్లి బాలస్వామి, నీలగిరి పీటర్, శ్రీకాంత్, శౌరీలు, నూతక్కి అప్పారావు, కొమ్మవరపు ముసలయ్య, పేరుపోగు ప్రసాద్, వడ్డవల్లి భాస్కర్, నీలగిరి నాగేంద్రబాబు, వడ్డవల్లి ప్రసాద్, చింతపల్లి సుధాకర్, పాలపర్తి సాంబయ్య, వడ్డవల్లి నాగేశ్వరరావు తదితరులున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కిక్కురు అల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ యేరువ బాలశౌరెడ్డి, ఎస్సీ నాయకులు చింతపల్లి శ్రీను, లూర్థయ్య, నీలగిరి కుమ్మయ్య, గర్నెపూడి బాబు తదితరులున్నారు.

టీడీపీ మాయమాటలతో వీడి పోయాం..

టీడీపీ నాయకుల మాయమాటలకు లోబడి వైఎస్సార్‌సీపీని వీడి పొరపాటు చేశాం..మళ్లీ చేర్చుకోవాలని కోరుతూ మండలంలోని తాళ్లచెరువుకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పించుకున్నారు. చేరిన వారిలో తమ్మిశెట్టి రామాంజమ్మ, బత్తుల నాగేంద్రమ్మ, గుంజి మల్లేశ్వరి, వేముల నాగేంద్రమ్మ, సంపంగుల రమణ, మేకం కోటేశ్వరమ్మలతో పాటు కొత్తగా టీడీపీ నుంచి జగ్గా నాగరాజు, నవ్వులూరి పవన్‌కళ్యాణ్, మాదిపాడు సుబ్బారావు తదితరులున్నారు.

మా ఊరి సేవా రత్నాలు



వెలితోటి చిన్న బాబు



పఠాన్ వాహిద్



మేలకశ్రావణి



కంచర్ల వెంకటేశ్వరరావు



కంభా రమేష్‌బాబు

పెదకూరపాడు: ఉత్తమ సేవకులకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రజలు మన్ననలు ఉంటాయని నిరూపించారు ఈ వలంటీర్లు. పెదకూరపాడు మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు గానూ 14 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటిలో మొత్తం 260 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. 255 మంది సేవ మిత్రలుగా ఎంపికయ్యారు. వారిలో పాడపాడు గ్రామ వలంటీర్ వెలితోటి చిన్న బాబు, కంభంపాడు గ్రామ వలంటీర్ కుంభా రమేష్ బాబు, హుస్సేన్‌నగరం వలంటీర్ కంచర్ల వెంటేశ్వర రావు, పాటిబండ్ల వలంటీర్ మేకల శ్రావణి, పెదకూరపాడు సచివాలయం-1 వలంటీర్ పఠాన్ వహిద్‌ఖాన్‌లను సేవ రత్న వరించింది. దీంతో ఆయా సచివాలయాల లబ్ధిదారులు సేవ రత్నకు ఎంపికై న వారిని అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ మిత్రగా ఎంపికవడంతో బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం, ప్రజలు మన్ననలతో ఉత్సాహంగా సేవలు అందిస్తామన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీతులసి, సాంబశివరావు

అచ్చంపేట: సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, వారి భర్త సాంబశివరావు మరో 300 మంది ఆత్మీయులతో ఆదివారం మాదిపాడు పంచాయతీ పరిధిలో స్వయం భూ సత్తెమ్మతల్లిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ సత్తెమ్మతల్లి నమ్మినవారికి కొంగుబంగారమని తెలిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్, ఆర్య వైశ్య సంఘ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాసరావు వారికి ఘన స్వాతగం పలికారు.

ఎన్‌ఆర్‌సీ, సీఏఏ చట్టాలతో ప్రజలకు ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీఎం నాయకుడు మస్తాన్‌వలి

నరసరావుపేట: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాల వలన దేశంలోని ఒక్క ముస్లింలే కాకుండా భారతీయులకు సైతం ఇబ్బందిగా మారుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాలకు వ్యతిరేకంగా స్టేషన్‌రోడ్డులోని విజయ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంబీఎం కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహమ్మద్ సమి మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు ఎలాంటి ఆధార్, రేషన్ కార్డులు లేకుండా అనేకమంది జీవిస్తున్నారని పేర్కొన్నారు. ముస్లింలతో పాటు వివిధ కుల,మతాల వారు ఉన్నారన్నారు. ఎంబీఎం, జై భీమ్ భారత్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, ముస్లిం, బీసీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వడ్డెర యువగర్జన సభ విజయవంతానికి పిలుపు



నరసరావుపేట: రాష్ట్రంలోని వడ్డెర కులస్తులను రాజకీయ పరంగా గుర్తించేందుకు ఈ నెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వడ్డెర యువ గర్జన మహాసభను ఏర్పాటు చేసినట్లు వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్ తెలిపారు. స్థానిక పల్నాడు రోడ్డులోని వడియరాజుల కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని వడ్డెర నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని 40 లక్షల ఓటు హక్కును కలిగిన వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి అన్ని రాజకీయ పార్టీలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వాలని కోరారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వడ్డెర కుల బలాన్ని తెలిపేందుకు నిర్వహించ తలపెట్టిన ఈ సభకు వడ్డెర కులస్తులంతా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

చురుగ్గా శివాలయం పునర్నిర్మాణ పనులు

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 200 ఏళ్ల నాటి ఈ ఆలయం పూర్తిగా జీర్ణావస్థకు చేరడంతో గ్రామపెద్దలు సమిష్టిగా పునర్నిర్మాణ పనులకు పూనుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో పురాతన ఆలయాన్ని తొలగించారు. తిరిగి కార్తీక మాసంలో డిశంబర్ 8న నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి భూమిపూజ చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ పునాది పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.కోటి నిధుల అంచనాతో రూపొందించే ఆలయ నిర్మాణ పనులకు భక్తులుతమవంతు సహాయ సహకారాలను అందించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.